RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో నెల్లూరులో వైభవంగా ప్రారంభమైన రొట్టెల పండుగ

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :209 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 27 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

# బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం



రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు

'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్

రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం

రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్

**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉధృతం చేసింది. మిగతా 2లో...

# తుంగభద్ర జలాలు

## రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్



తుంగభద్ర నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్న బీజేపీ

తెలంగాణకు రావాల్సిన నీటిలో భారీగా కోత పడుతోందన్న రామచందర్ రావు

సర్ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల మీద విమర్శ

**హైదరాబాద్, సింధూరదర్శిని:** తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. మిగతా 2లో...

# నేడు మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

వెలిగొండ ప్రాజెక్టు పరిశీలన... లబ్ధిదారులతో భేటీ


గిద్దలూరులో సంజీవని కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, సింధూరదర్శిని:**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజున యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజక వర్గాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జూలై నెలకు మొదటి ఫేజ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా సాగుతోన్న వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనతో పాటు గిద్దలూరు నియోజకవర్గంలో సంజీవని కార్యక్రమంలో పాల్గొంటారు.

**వెలిగొండ లబ్ధిదారులతో సమావేశం**

మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు వెలిగొండ ప్రాజెక్టు ఎంతో కీలకం. ఇది పూర్తైతే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 జిల్లాల్లోని 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరతాయి. అంతేకాదు దశాబ్దాలుగా నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకూ ముగింపు పలుకుతుంది. రెండు దశలుగా సాగుతోన్న ఈ ప్రాజెక్టులో స్టేజ్-Iలో 1,19,000 ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు, స్టేజ్-IIలో 3,28,300 ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందుతుంది. స్టేజ్-I కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.5,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దాదాపు 19 కి.మీ. మేర టన్నెల్-I తవ్వకం,





ఎగ్జిట్ ఛానల్ ఌ లింక్ ఛానల్ పనులు పూర్తయ్యాయి. ఫీడర్ కాలువ, తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువ సిద్ధమయ్యాయి. రెండు హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్ లైనింగ్, అప్రోచ్ ఛానల్, తూర్పు ప్రధాన కాలువ పనులు చివరి దశకు వచ్చాయి. ఆర్ అండ్ ఆర్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.190 కోట్లను ఖర్చు చేసింది. మొత్తం 11గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయి. ఈ మేరకు రేపు ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

**సంజీవనితో మెరుగైన సేవలు**

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రభుత్వం సంజీవని ప్రాజెక్ట్ తీసుకొచ్చింది. అందరికీ ఆరోగ్య సేవలు, ఆరోగ్య భద్రత చేకూర్చాలన్నది ఈ కార్యక్రమం లక్ష్యం. నాణ్యమైన, అందుబాటు ధరల్లో, సకాలంలో వైద్య సేవలు అందించే సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక ఈ సంజీవని. పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రి వరకు, ఆరోగ్య ఉప కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానం చేయనున్నారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, మాతృ-శిశు ఆరోగ్యసేవలు, 108 ఎమర్జెన్సీ, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ-ఔషధి వంటి అన్నింటినీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ కిందకు తెస్తోంది. గతేడాది జూలై 3న కుప్పంలో, ఈ ఏడాది మార్చి 15న చిత్తూరు జిల్లాలో పైలట్‌ప్రాజెక్ట్‌గా మిగతా 2లో...

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం

ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు

వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం

టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం

బయలుదేరే విమానాశ్రయంలోనే ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ పూర్తి

భారత్‌ను గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న కేంద్రం

కొత్త విధానంతో భారీగా ఉద్యోగాలు, ఆర్థిక ప్రగతి అంచనా





**అమరావతి, సింధూరదర్శిని:** టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు మిగతా 2లో...

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి

పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్



**అమరావతి, సింధూరదర్శిని:** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితు ల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మిగతా 2లో...

# ఆధార్ నంబర్ కొడితే అన్ని వివరాలు రావాలి

ఆర్టీజీఎస్ సేవలపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష

ఆధార్ నంబర్‌తోనే అన్ని సర్టిఫికెట్ల డిజిటల్ వెరిఫికేషన్

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన

కుల, ఆదాయ ధృవపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం

డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారం అనుసంధానం

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలకు ఆదేశం



**అమరావతి, సింధూరదర్శిని:** కేవలం ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే, ఒక అభ్యర్థికి సంబంధించిన అన్ని రకాల విద్య, క్రీడా సర్టిఫికెట్లు డిజిటల్‌గా వెరిఫై అయ్యే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా, రాబోయే వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొట్టగానే, ఆ సర్టిఫికెట్‌ను ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. ఇది అధికారుల పనిని 99 శాతం సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల పురోగతిని ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఒకేచోట మిగతా 2లో...

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలనని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, "రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి" అని స్పష్టం చేశారు.

## నేడు మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

'సంజీవని' ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో గొప్ప ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. సంజీవని ద్వారా డాక్టర్‌తో అపాయింట్మెంట్ బుక్ చేసుకునే సదుపాయం, వైద్యం తర్వాత డాక్టర్ స్వయంగా ఆరోగ్యంపై ఫాలోఅప్ చేయడం, వర్చువల్ కనెక్ట్ ద్వారా ఎక్స్‌పర్ట్స్ ఉన్న ప్రాంతం నుంచి కూడా వైద్యం అందించడం, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ మోనిటర్ చేయడం, సంజీవని వెల్‌నెస్ యాప్ ద్వారా మీ ఆరోగ్య సూచనలు పొందవచ్చు. డిజిటల్ హెల్త్ రికార్డ్స్‌తో ఒక ఏఐ డాక్టర్‌ను ఇవ్వడమే సంజీవని ముఖ్య ఉద్దేశం

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఉదయం 10:45గంటలకు దోర్నాల మండలం, గంటవానిపల్లెకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 12:20 గంటల వరకూ వెలిగొండ ప్రాజెక్టు సందర్శనతో పాటు, అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. వెలిగొండ ప్రాజెక్టు పర్యటన ముగించుకుని 12:35 గిద్దలూరు నియోజకవర్గం కృష్ణంసెట్టిపల్లికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 01.10 నుంచి 01.40 వరకు కృష్ణంసెట్టిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని పథకం లబ్ధిదారులు, వైద్య సిబ్బందితో సమావేశం అవుతారు. 01:45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 03.35 గంటలకు టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 06.15 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. "భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు" అని ఆయన తెలిపారు.

ఈ 'ఈజీ కనెక్ట్' వ్యూహంతో 2030 నాటికి భారత్‌ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్‌గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా.

## ఆధార్ నంబర్ కొడితే అన్ని వివరాలు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

క్రోడీకరించే 'డేటా లేక్' పనులను జులై నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల సంఖ్యను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, వారిని తిరిగి బడికి రప్పించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్‌తో అనుసంధానించాలన్నారు.

**ప్రజా సేవలు మరింత చేరువ కావాలి**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నెలరోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సేవలను ఎలా వినియోగించుకోవాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని, రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తత**

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలవనరులు, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భజలాల స్థాయిని ఆర్టీజీఎస్‌లోని 'అవేర్' విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ముఖ్యంగా రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తుంగభద్ర జలాలు: రేవంత్ సర్కార్‌పై రాంచందర్‌రావు ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026--27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఫీజ్ఞ (ఫీశ్రీబవ జబతీవఎ ఎఱతీవస్త్రఱఅఱఖ) పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు.

అలాగే, ఫీజ్ఞ పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# రైల్వే కోడూరు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశమైన కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్





రైల్వే కోడూరు సింధూరదర్శిని:

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలంలోని రాఘవ రాజుపురం టిడిపి నియోజకవర్గ కార్యాలయం నందు రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇన్చార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో , రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పర్యవేక్షణలో ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి సమావేశ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా జులై రెండవ తేదీన నిర్వహించబోయే ఎంతో ప్రతిష్టాత్మకమైన సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ జులై రెండవ తేదీన జరగబోయే విబిజి రాంజీ గ్రామీణ పథకం దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా

**వి బి జి రాంజీ గ్రామీణ పథకం ప్రారంభోత్సవ సభకు సంబంధించి నాయకులతో కలిసి సమావేశం**

**సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ముక్కారూపానంద రెడ్డి**

చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహన్ విచ్చేయుచున నేపథ్యంలో జన సమీకరణ, ఎవరెవరుకి ఎటువంటి బాధ్యతలు ఇవ్వాలి, కమిటీలు, పంచాయతీలు వారీగా జన సమీకరణ ఎలా చేయాలి అనే విషయాలను విచ్చేసినటువంటి ఎన్డీఏ కూటమి నాయకులు తో చర్చించి ప్రణాళికల సిద్ధం చేసుకుని మనమంతా సభను విజయవంతం చేసుకునే విధంగా ముందుకు వెళ్లాలని దేశం మొత్తం మీద గతంలో 2006వ సంవత్సరంలో మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం మన రాయలసీమలో ప్రారంభోత్సవం జరిగిన సంగతి అందరికీ తెలిసినదే మళ్లీ 2026లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన ఈ వీబిజి రాంజీ గ్రామీణ ఉపాధి పథకం మరల రాయలసీమ జిల్లాలో మన రైల్వేకోడూరు నియోజకవర్గ మంగంపేటలో ప్రారంభోత్సవం కావడం మనం మన ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, కొణిదెల పవన్ కళ్యాణ్ ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశం అనంతరం కేంద్ర గ్రామీణ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌ని మర్యాదపూర్వకం గా కలిసి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోయే విబిజి రాంజీగ్రామీణ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్**




క్రోసూరు (సింధూరదర్శిని: పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా శుక్రవారం క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించిన మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడానికి సిబ్బంది కృషి చేయాలని తెలియజేశారు వైద్య అధికారులు రవికుమార్, అనిల్ కుమార్ ల పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు క్రోసూరు మండలంలో 0 – 5 సంవత్సరాల వయసు గల 5,204 మంది చిన్నారులను లక్ష్యంగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు కార్యక్రమ నిర్వహణ కోసం మండల వ్యాప్తంగా 21 బూత్ లు , మొబైల్ వాహనాలు రెండు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు ఇంటింటి సర్వే కోసం 42 ప్రత్యేక బృందాలు, 84 మంది వ్యాక్సినేటర్లు, రూట్ సూపర్వైజర్ల ఇద్దరు, మొబైల్ సూపర్వైజర్లు ఇద్దరు విధులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు వ్యాక్సిన్ నిల్వ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, హెల్త్ సూపర్వైజర్ శివుడు, స్టాఫ్ నర్స్ రాజ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, ఫార్మసిస్ట్ ఫాతిమా, రూట్ ఆఫీసర్లు ప్రహ్లాద్, ప్రేమ రాజ్ తదితరులు పాల్గొన్నారు



# అక్రమ మద్యం విక్రయాల పై ప్రత్యేక తనిఖీలు

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు

గూడూరు (సింధూర దర్శిని) 26 జూన్ నెలలో జిల్లా ; ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గూడూరు రూరల్ మండల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెడిచర్ల గ్రామంలోని సీతాలమ్మ గుడి వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీలలో మీసాల కోటేశ్వరయ్య అను వ్యక్తి సదరు ప్రదేశంలో అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉండగా తనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై ఎక్సైజ్ శాఖ నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తుందని, ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక తనిఖీలలో ఎస్సై శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి శ్రీ సిటీ పర్యటన పై ముందస్తు ఏర్పాట్లు

## శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు

## ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ , ఎస్పీ



శ్రీ సిటీ ( సింధూర దర్శిని) 26 జూన్ తిరుపతి జిల్లా ; రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జులై 1న శ్రీ సిటీలో హీరో మోటార్ కార్ప్ ఏర్పాటు చేయనున్న తమ రెండవ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు , అధికారులు కంపెనీ ప్రతినిధులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను, ఎలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, ముఖ్యమంత్రి రాకపోకల మార్గం, భద్రతా ఏర్పాట్లు, అలాగే, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్య మంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సిల్ట్ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి

## మున్సిపల్ కమిషనర్‌కి తెలిపిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి



గూడూరు ( సింధూర దర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చెన్నూరును శుక్రవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డితో కలిసి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలానికి ఇబ్బంది పడకుండా ముందుగానే డ్రైన్లు మరియు పంట కాలవలు నందు సీల్ట్ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కి తెలియజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం

చీరాల ( సింధూర దర్శిని) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమం లో చీరాల శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య ప్రజల వద్ద నుండి వినతుల అర్జీలను స్వీకరించారు. మొత్తం 40 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం & ఇంటి స్థలాల కోసం 18, 15 పింఛన్లు, 2 సీఎంఆర్ఎఫ్ ఫైల్స్ , 5పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ~ావీజ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, పట్టణ అధ్యక్షులు సురేష్ , గోలి జగదీష్ , బిందు, కూటమి నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



# నెల్లూరులో వైభవంగా ప్రారంభమైన రొట్టెల పండుగ

**పోటెత్తిన భక్తులు-రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు**

**స్వర్ణాల చెరువులో బోట్ షికారు-డ్రోన్లు, సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా**

**బారాషహీద్ దర్గా ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చిన కూటమి ప్రభుత్వం**

**50 ఏళ్లుగా వస్తున్నానన్న ఎంపీ మాగుంట**



నెల్లూరు ( సింధూరదర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా; 2014 - 19లో బారా షహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తింపు ఇచ్చారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం బారా షహిద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపి మాగుంట, మేయర్ సుజాత,వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్,కలెక్టర్ హిమాన్షు శుక్లా,ఎస్పీ అజితా వేజెండ్ల,కమీషనర్ నందన్ తో కలిసి బోట్ షికార్ చేశారు. స్వర్ణాల చెరువులో రాష్ట్ర అభివృద్ధి రొట్టెను పట్టుకున్నారు. దర్గాలో బారాషహీద్ ల సమాధులను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ పనితీరును పరిశీలించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 412 సంవత్సరాల చరిత్ర ఉన్న బారా షహిద్ దర్గాలో భక్తుల సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతోందన్నారు. సరైన వసతులు లేకపోవటంతో 2014కి ముందు 4లక్షలమంది భక్తులు వచ్చే వారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇక్కడ వసతులు పూర్తిగా పెంచి అభివృద్ధి చేసామన్నారు. ఈ సంవత్సరం సుమారుగా 15 లక్షల మంది రానున్నారని అంచనా వేస్తున్నామని తెలిపారు. టూరిజం హబ్‌గా బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దుతున్నాం అని మంత్రి తెలిపారు. ఎంతో నమ్మకంతో దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. స్వర్ణాల చెరువులో నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. 6315 మంది మున్సిపల్ శాఖ సిబ్బంది, 1870 పోలీసులు, గజ ఈతగాళ్ళు, బోట్ షికారు కోసం 8 బొట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుదూర ప్రాంతాలనుండి, రాష్ట్ర నలుమూలల నుండి దేశ విదేశాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరాలు ఉన్నాయన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ 5 రోజుల పండుగ తర్వాత కూడా మరో 5 రోజులు భక్తులు వస్తూనే ఉంటారన్నారు. అపరిశుభ్రత లేకుండా దర్గా ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా రొట్టెల పండుగ కార్యక్రమంలో పాల్గొంటూ ఉన్నాను. చాలా అద్భుతంగా ఏర్పాట్లు చేశారు. 2014 తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి నారాయణ దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

**టూరిజం స్పాట్ గా బారా షహిద్ దర్గాను తీర్చిదిద్దడం చాలా సంతోషంగా ఉంది...**

మంత్రి నారాయణ ఆధ్వర్యంలో చెరువుని ట్యాంక్ బండ్ గా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను. వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మతసమరస్యానికి ప్రతీకగా నెల్లూరు లో రొట్టెల పండుగ జరిగుతుంది

2014కి ముందు ఒకలా. 2014 తర్వాత వేడుకగా ఈ పండుగ జరుగుతోందన్నారు. మంత్రిగా నారాయణ , మేయర్ గా నేను ఉన్న సమయంలో దర్గా అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లో మంత్రి నారాయణ సహకారంతో ఘాట్ లు నిర్మించాం, టాయిలెట్స్, షవర్లు ఏర్పాటు చేసాం. సిమెంట్‌రోడ్లు, షెల్టర్లు నిర్మించాం. భక్తులకు చిన్న ఇబ్బంది జరగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసాం, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెంచాం.

**ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అతిథులని ఆదరిద్దాం... వారికి సహకరిద్దాం**

27వ తేదీ రాత్రి గంధమహోత్సవం జరుగుతుందని భారీగా భక్తులు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,రొట్టెల పండగ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మైనారిటీ నాయకులు, సయ్యద్ షమీ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు అన్ని పరిశుభ్రంగా ఉండాలి

**-మున్సిపల్ కమిషనర్ వై ఓ. నందన్**

**-రొట్టెల పండుగలో పారిశుద్ధ్య నిర్వహణ పర్యవేక్షించిన కమిషనర్**



నెల్లూరు (సింధూర దర్శిని ) 26 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు బారా షహీద్ దర్గా రొట్టెల పండుగ మొదటి రోజు శుక్రవారం నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ప్రాంగణంలోని పరిసరాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. రిసెప్షన్ సెంటర్ ద్వారా భక్తులకు అందజేస్తున్న సేవలను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు వివిధ సూచనలను జారీ చేసారు. సమాచారం నిమిత్తం రిసెప్షన్ సెంటర్ కు విచ్చేసిన భక్తులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందించాలని సూచించారు. దర్గా ప్రాంగణంలోని అన్నదాన శిబిరాల వద్ద శుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాడి పడేసిన ప్లేట్లు, గ్లాసులను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సిబ్బంది కోసం భోజనాలు తయారు చేసే ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పండుగ జరిగే రోజుల్లో సిబ్బందికి అందజేయనున్న ఆహారాన్ని కమిషనర్ స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ, ఇతర ప్రయివేటు ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల పరిసరాలు అత్యంత పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని శానిటేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. దర్గా ప్రాంగణంలో ఎన్టీఆర్ సుజల మంచినీటి కేంద్రాల ద్వారా నిరంతరం సేవలను అందించాలని, మంచినీటి కేంద్రాల సమీపంలో పరిశుభ్రతను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. స్వర్ణాల తీరంలో రొట్టెలు మార్చుకునే ప్రాంతమంతా అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణ పనులను సంబంధిత విభాగాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు తీరంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు చెరువులో నుంచి ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు స్నానాలు చేసే ప్రాంతంలో పటిష్టమైన భద్రతను కల్పించి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యంగా స్వర్ణాల తీరంలో మహిళా భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని రొట్టెల పండుగ నిర్వహణను విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# పటిష్ట పోలీస్ బందోబస్త్ మధ్య ప్రశాంతంగా రొట్టెల పండుగ ఉత్సవాలు

## జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల

నెల్లూరు ( సింధూర దర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా; రాష్ట్ర ప్రాముఖ్యత కలిగిన బారా షహిద్ దర్గా రొట్టెల పండుగ-2026 సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రశాంతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. అజితవేజెండ్ల తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 96 సీసీటీవీ కెమెరాలు మరియు 26 డ్రోన్ల సహాయంతో దర్గా ప్రాంగణం, క్యూ లైన్లు, ట్యాంక్ బండ్, బోటింగ్ ప్రాంతం, పార్కింగ్ స్థలాలు తదితర ప్రాంతాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీస్ డాగ్ స్క్వాడ్లు మరియు బాంబ్ డిస్పోజల్ టీమ్స్ ద్వారా దర్గా పరిసర ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా నేరాల నివారణ కోసం ప్రత్యేక క్రైమ్ టీమ్స్ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, కార్యకలాపాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రద్దీ సమయంలో తప్పిపోయే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్ ద్వారా ఇప్పటివరకు 13 మంది చిన్నారులను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ జోన్లు, పార్కింగ్ ప్రాంతాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తూ వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్యాంక్ బండ్ మరియు బోటింగ్ ప్రాంతాల్లో అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ, వాటర్ ఫ్రంట్ ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. దర్గా క్యూ లైన్లలో భక్తుల రాకపోకలు సాఫీగా జరిగేలా ప్రత్యేక క్యూ మేనేజ్‌మెంట్ వ్యవస్థను అమలు చేసి, ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తో పాటు, అడిషనల్ ఎస్పీ సి. హెచ్. సౌజన్య మరియు టౌన్ ఏఎస్పీ దీక్ష భక్తులకు పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ట్రాఫిక్ మరియు పార్కింగ్ నిబంధనలను అనుసరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని, చిన్నారులను ఎల్లప్పుడూ తమ వెంట ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, రొట్టెల పండుగ ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని తెలిపారు.

# భక్తులకు మెరుగైన సౌకర్యాలు పటిష్ట భద్రత కల్పించాలి







## పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు ( సింధూర దర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా; రొట్టెల పండుగ--2026 ఏర్పాట్లను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ , ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట. శ్రీనివాసులు రెడ్డి , జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తో కలిసి పరిశీలించిన జిల్లా ఎస్. పి. డా. అజిత వెజెండ్ల - భక్తులకు మెరుగైన సౌకర్యాలు, పటిష్ట భద్రత కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. మొహరం సందర్భంగా నెల్లూరు నగరం లోని బారా షహీద్ దర్గా వద్ద నిర్వహించబడుతున్న ప్రసిద్ధ రొట్టెల పండుగ--2026 ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, , జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, భక్తుల రాకపోకల కోసం చేపట్టిన ట్రాఫిక్ ఏర్పాట్లు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు, పారిశుధ్య ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్ వ్యవస్థ, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్వర్ణాల చెరువు వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఘాట్లను సందర్శించి, భక్తులు సురక్షితంగా రొట్టెలు మార్చుకునేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఘాట్ల వద్ద రక్షణ చర్యలు, లైటింగ్ సదుపాయాలు, బారికేడింగ్, ప్రత్యేక పోలీసు బందోబస్తు, అత్యవసర సేవల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. దర్గా వద్దకు విచ్చేసిన భక్తులతో మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ మాట్లాడి వారికి కల్పించబడుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులు ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేయగా, మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. పర్యాటకులు, భక్తుల కోసం స్వర్ణాల చెరువులో ఏర్పాటు చేసిన బోట్ షికారు సేవలను కూడా ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ , ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి , కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల బోట్ షికారులో పాల్గొని ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. రొట్టెల పండుగ సందర్భంగా వేలాదిమంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున భద్రతా పరంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల తెలిపారు. దర్గా పరిసర ప్రాంతాలు, స్వర్ణాల చెరువు ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, షీ-టీమ్స్, ప్రత్యేక పోలీసు బృందాలు, ట్రాఫిక్ సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. తదనంతరం మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో రొట్టెల పండుగ బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసుశాఖ సిబ్బందికి పోలీస్ సేవాదళ్ రేడియం జాకెట్లను పంపిణీ చేశారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సి. హెచ్. సౌజన్య , టౌన్ ఏఎస్పీ దీక్ష, రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.







# గణపయ్య సేవలో ప్రముఖులు: ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం (సింధూర దర్శిని) 26 జూన్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ ఐఏఎస్ అధికారులు బుధితి రాజశేఖర్ , ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవసాయశాఖ, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, మరియు సి. హెచ్ శ్రీధర్ , మైనార్టీ వెల్ఫేర్ కార్యదర్శి కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకున్నారు, వీరు వేరువేరుగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, ఐరాల రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- సర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రతి ఇంటికి వెళ్లి 2002ఓటర్ల జాబితాతో సరిపోల్చి ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలి
- ఈ ప్రక్రియ మొత్తం బిఎల్ఎలను పిలిపించి వారి సమక్షంలో జరిగేటట్లు చూడాలి
- జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి (సింధూరదర్శిని) 26 జూన్ తిరుపతి జిల్లా; ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ .వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీ ముత్యాలమ్మ గుడి వీధి లో , వసుంధర నగర్ లో విస్తృతంగా పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు ఎన్రోల్మెంట్ ఫారాలను తప్పనిసరిగా అందజేసి వాళ్లకు అర్థమయ్యేలా వివరించి పారాలను పూరించడంలో సహకరించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లకు స్వయంగా ఎన్రోల్మెంట్ ఫారాలను అందజేశారు. ఇంటింటి సర్వే సందర్భంగా 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆ గృహాల్లో నివసిస్తున్న ఓటర్ల వివరాలను సరిపోల్చాలని కలెక్టర్ సూచించారు. జాబితాలో ఉన్న వ్యక్తులు ఆ ఇంటిలో లేకపోతే వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో గుర్తించి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ప్రత్యేక కార్యాచరణతో పనులను వేగవంతం చేసి శాతాన్ని గణనీయంగా పెంచాలని అధికారులకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. బీఎల్వోలు ప్రతి గృహాన్ని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేయాలని, ఎవరూ మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి రూరల్ తహసిల్దార్ జనార్ధన్ రాజు, బి ఎల్ ఏ లు బి ఎల్ వోలు పాల్గొన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ తిరుపతి అర్బన్ మండలం ఆటోనగర్లో పర్యటించి అక్కడ జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇదిలా ఉండగా పట్టణ పరిధిలో సర్ ప్రక్రియ పరిశీలన సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో సరఫరా అవుతున్న త్రాగునీరు సక్రమంగా వస్తుందా, పింఛను ఒకటో తేదీ అందుతుందా అని ఆరా తీశారు. డ్రైనేజీని పరిశీలించి సక్రమంగా క్లీన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణ ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ ఉప కమిషనర్ అమరయ్య, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎలక్షన్ డిటి సుధాకర్ నాయక్ రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలి: ఎస్పీ




నెల్లూరు (సింధూరదర్శిని) 26 జూన్ నెల్లూరుజిల్లా; అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవము శుక్రవారం పురస్కరించుకుని, జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్-2026" కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో, జిల్లా అబ్కారీ శాఖ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖల సంయుక్త సహకారంతో నెల్లూరు సిటీ టౌన్ హాల్‌లో విద్యార్థుల కోసం మెగాడ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ "నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్" అనే అంశాన్ని ప్రస్తావిస్తూ, మాదకద్రవ్యాల నిర్మూలనే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ దుర్వినియోగం మరియు అక్రమ రవాణా లో డిమాండ్ సైడ్ మరియు సప్లై సైడ్ రెండింటినీ సమర్థవంతంగా నియంత్రించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలు, వినియోగం వంటి అన్ని రూపాలపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కేసుల్లో పోలీసులు మాత్రమే కాకుండా న్యాయవ్యవస్థ కూడా కఠినంగా వ్యవహరిస్తుందని విద్యార్థులకు వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా "నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. టౌన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాస్టర్ అనిత్ కుమార్ రాజా "డ్రగ్స్ వద్దు - చదువు ముద్దు" అనే అంశంపై ప్రసంగించి, హాజరైన వారందరితో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మాస్టర్ అనిత్ చొరవను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు జాతీయ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్- 14446కు సమాచారం అందించాలని సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి. ఆరోగ్యం, విద్య,క్రీడలు, సంగీతం, మంచి వృత్తి, ఉజ్వల భవిష్యత్తుకు 'అవును' చెప్పండి" అంటూ యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్&ఎక్సైజ్ఆఫీసర్ శ్రీనివాసుల నాయుడు జిల్లా దివ్యంగుల వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ అయూబ్ అలీ మరియు ఇంటర్మీడియట్ ఆర్ఐఓ వరప్రసాద్, పోలీస్ ఇతర శాఖల అధికారులు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు ఏర్పాట్లు పక్కాగా చేయాలి

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు (సింధూర దర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా; సంక్షేమ పథకాల ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా పర్యటనలో భాగంగా పున్నపువారిపాలెం గ్రామానికి విచ్చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్లకూరు మండలం పున్నపు వారిపాలెం గ్రామానికి సీఎం చంద్రబాబు నాయుడు జూలై ఒకటో తేదీన రానున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రజా వేదిక , హెలిపాడ్, సభా స్థలిని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణలో ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు సభాస్థలానికి సంబంధి ంచిన స్థలాన్ని పరిశీలించి చదును చేయడం జరిగిందన్నారు. సీఎం పర్యటనకు నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు హాజరుకానున్న క్రమంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట తానంకి నానాజీ, పెన్వర్ ఆక్వా కంపెనీ డైరెక్టర్ గంటా మధుకృష్ణ, గుండాల లీలావతి పెనుబోలు జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

**ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు**

సీఎం పర్యటన కార్యక్రమంలో భాగంగా చిల్లకూరు మండలం కోడూరు పంచాయతీ లోని పున్నపువారిపాలెం గ్రామంలో సభాస్థలి ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని జిల్లా అధికారులు పరిశీలించారు. ఏర్పాట్లపై మెప్మా జిల్లా అధికారి మీసాల కిరణ్ కుమార్ పలు సూచనలు ఇచ్చి అధికారులు ఈ ప్రాంతంలోనే ఉంటూ ఏర్పాట్లు పర్యవేక్షించాలి అన్నారు. అలాగే గూడూరు ఇన్చార్జి డిఎస్పి గిరిధర్ రూట్ మ్యాప్ పై పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, చిల్లకూరు తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి, రూరల్ సీఐ కిషోర్ బాబు, చిల్లకూరు ఎస్సై సురేష్ బాబు, ఆర్ ఐ పూర్ణ, మండల సర్వే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక వసతుల నిర్మాణాలకు శంకుస్థాపన

## డిజిపి హరీష్ కుమార్ గుప్తా




తిరుపతి ( సింధూర దర్శిని) 26 జూన్ తిరుపతి జిల్లా ; ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం తిరు పతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ సంక్షేమానికి సంబంధించిన పలు మౌలిక వసతుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, ప్రధాన ప్రవేశ ద్వారం వాల్ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సతీమణి కూడా పాల్గొన్నారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీజీపీ , అదనపు డీజీపీ తో కలిసి జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జిల్లాలో అమలవు తున్న పరిపాలనా చర్యలు, పోలీసింగ్ విధానాలు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీలు, డీఎస్పీలు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియం త్రణ, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ, సీసీ కెమెరాల వినియోగం, పటిష్ట నైట్ బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డీజీపీ క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్థ నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో సమర్థవంతంగా వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు. అదేవిధంగా మాదకద్ర వ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ప్రతి సబ్ డివిజన్ పరిధిలో సర్కిల్ వారీగా నిరంతర డ్రగ్స్, గంజాయి నిరోధక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు, డ్రగ్ టెస్టింగ్ నిర్వహిస్తూ యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత బస్సు యాత్ర, ప్రమాదాలకు గురయ్యే (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాల గుర్తింపు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరా లను కూడా ఎస్పీ డీజీపీ కి వివరించారు.

మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, శక్తి టీమ్ ద్వారా మహి ళలకు తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలవుతున్నా యని ఎస్పీ వివరించారు. సైబర్ నేరాల నియంత్రణలో తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సైబర్ ం సోషల్ మీడియా మానిటరింగ్ వ్యవస్థ చురుకుగా పనిచేస్తోందని డీజీపీ ప్రశంసించారు. అలాగే యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరంతర డ్రగ్ టెస్టింగ్, ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని సన్మార్గంలో నడిపించే దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను అభినందిం చారు. జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, సాంకేతిక ఆధారిత ఆధునిక పోలీసింగ్, పోలీస్ సంక్షేమం, ప్రజా సేవల మెరుగుదల దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను డీజీపీ అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి:కలెక్టర్

బాపట్ల (సింధూర దర్శిని) సూర్యలంక బీచ్ కు వచ్చే పర్యాటకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి బాపట్ల మండలం సూర్యలంక బీచ్ ఆఫీసు లో ఉన్న బీచ్ మెడికల్ కేంద్రాన్ని మెడికల్ టీమ్ తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మెడికల్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది, అత్యవసర చికిత్స పరికరాలు, మందుల నిల్వలు, ప్రథమ చికిత్స సదుపాయాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సూర్యలంక బీచ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో వారికి అవసరమైన అన్ని రకాల ప్రాథమిక, అత్యవసర వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి చికిత్స అందించే విధంగా వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెడికల్ కేంద్రంలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ప్రథమ చికిత్స సామగ్రి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. పర్యాటకుల భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్. ఎస్. విజయమ్మ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



# రొట్టెల పండగకు తొలిరోజు భక్తుల రద్దీ

**సుదూర ప్రాంతాల నుంచి భారీగా విచ్చేసిన భక్తులు - పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సేవలు**

**పటిష్ట పోలీసు బందోబస్తు - పక్కాగా ఏర్పాట్లు ... సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు**

**ప్రశాంత వాతావరణంలో రొట్టెలు మార్చుకున్న భక్తులు**

నెల్లూరు ( సింధూర దర్శిని) 26 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు తొలి రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం... కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

### పటిష్ట బందోబస్తు

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు 1800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు.

### పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి 6 వేలకు పైగా సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి.

### వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్ ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మొదటిరోజు సుమారు 400 మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

### ప్రత్యేకంగా ఆయుష్ వైద్య శిబిరం

ప్రజలకు ఆయుష్, యునాని, హోమియో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రొట్టెల పండుగలో ప్రత్యేకంగా ఆయుష్ స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరాజు, సరళ హెప్సిబా, జ్ఞాన ప్రసూన, వినోద్ బాబు వైద్య సేవలు అందించారు. సుమారు 500 మంది ఆయుష్ విభాగం సేవలను వినియోగించుకున్నారు.

### అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

### భక్తులందరికీ అన్నదానం

రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని స్టాల్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు అందజేస్తున్నారు.

### ప్రత్యేకంగా మీడియా పాయింట్

రొట్టెల పండుగ కవరేజ్ నిమిత్తం దర్గాకు విచ్చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్ ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ కేంద్రం నుంచి తమ విధులు నిర్వహిస్తూ రొట్టెల పండుగ విశేషాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్నారు. మీడియా వారికి ప్రత్యేకంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు.







# చల్లదనం నుంచి రక్షణ కోసం కట్టిన ఇళ్లే బ్రిటన్‌కు సమస్యగా మారాయా?

యూకేలో 35డిగ్రీల వేడి, ఇండియాలో 45°C కంటే ఎందుకు తీవ్రంగా అనిపిస్తుంది?

పశ్చిమ యూరప్‌ను అతలాకుతలం చేస్తున్న తీవ్రమైన వేడిగాలులు

గాలిలో అధిక తేమ, వేడిని నిల్వ చేసే ఇళ్ల నిర్మాణం ప్రధాన కారణాలు

వేడిని తట్టుకునే అలవాటు లేకపోవడం, ఎక్కువ పగటి సమయం కూడా ప్రభావం

వాతావరణ మార్పులతో బ్రిటన్ మౌలిక సదుపాయాలకు కొత్త సవాల్




పశ్చిమ యూరప్ దేశాలు తీవ్రమైన వేడిగాలులతో అల్లాడిపోతున్నాయి. ముఖ్యంగా బ్రిటన్, స్విట్జర్లాండ్‌లలో జూన్ నెలలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఎండల ధాటికి చాలా మంది ప్రాణాలు కోల్పోగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలు, పర్యాటక ప్రదేశాలను కూడా మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. బ్రిటన్‌లో దాదాపు 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతుండగా, ప్రజలు వేడిని తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే, భారత్‌లో వేసవిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా ప్రజలు తట్టుకుంటారు. ఈ నేపథ్యంలో బ్రిటన్‌లో 35 డిగ్రీల వేడి, భారత్‌లోని 45 డిగ్రీల కంటే ఎందుకు అంత తీవ్రంగా, భరించలేనిదిగా అనిపిస్తుందనే ప్రశ్న వస్తోంది.

**నిపుణుల విశ్లేషణ ప్రకారం.. దీనికి అనేక కారణాలున్నాయి.** గాలిలో తేమ, ఇళ్ల నిర్మాణం, ఎక్కువ పగటి సమయం, వేడిని తట్టుకునేందుకు ప్రజలు అలవాటుపడి ఉండటం వంటి అంశాలు ఈ అనుభవంలో తేడాకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**అధిక తేమతో తీవ్ర ఇబ్బంది**

భారత్ లేదా దక్షిణ యూరప్ లోని కొన్ని ప్రాంతాల మాదిరిగా కాకుండా, బ్రిటన్ అట్లాంటిక్ మహాసముద్రం, ఇతర సముద్రాల మధ్యలో ఉండటంతో అక్కడి గాలిలో తేమ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. లండన్ వంటి నగరాల్లో వేడి రోజున సాపేక్ష తేమ (తీవశ్రీఫ్అజవ ష్టబఎఅఉఅఊఎ) 40 శాతానికి పైగా ఉంటే, దాదాపు అదే ఉష్ణోగ్రత ఉన్న మాడ్రిడ్ వంటి నగరాల్లో ఇది 20 శాతం లోపే ఉంటుంది. ఈ అదనపు తేమ, మానవ శరీరం వేడిని అనుభవించే విధానంలో పెను మార్పును తీసుకొస్తుంది.

శరీరాన్ని చల్లబరిచే సహజ ప్రక్రియ చెమట పట్టడం. అయితే, ఆ చెమట ఆవిరైనప్పుడు మాత్రమే చర్మం చల్లబడుతుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, చెమట ఆవిరయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఫలితంగా శరీరం సమర్థవంతంగా చల్లబడదు. దీంతో తక్కువ ఉష్ణోగ్రతల వద్ద కూడా వేడి అలసట, డీహైడ్రేషన్, గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యలు పెరిగే ప్రమాదం ఉంటుంది.

**వేడిని నిల్వ చేసే ఇళ్లు**

బ్రిటన్‌లోని భవనాలు, ఇళ్ల నిర్మాణం అక్కడి చల్లని, తడి వాతావరణానికి అనుగుణంగా ఉంటుంది కానీ, తరచుగా వస్తున్న వేడిగాలుల కోసం కాదు. ఇటుక ఇళ్లు, టైల్స్ వేసిన పైకప్పులు, కాంక్రీట్ భవనాలు పగలంతా వేడిని గ్రహించి, రాత్రిపూట నెమ్మదిగా విడుదల చేస్తాయి. శాస్త్రవేత్తలు వీటిని 'థర్మల్ బ్యాటరీలు'గా అభివర్ణిస్తున్నారు. వేడి దేశాల్లో సర్వసాధారణమైన ఎయిర్ కండిషనింగ్ (ఏసీ) కూడా బ్రిటన్ ఇళ్లలో చాలా అరుదుగా కనిపిస్తుంది. దీనికి విరుద్ధంగా, భారత్ వంటి దేశాల్లో వేడిని తట్టుకునేలా మందపాటి గోడలు, నీడ ఉండే ప్రాంగణాలు, మెరుగైన వెంటిలేషన్ వంటి ఏర్పాట్లు ఉంటాయి.

**అలవాటు లేని వాతావరణం.. సుదీర్ఘ పగలు**

భారత్‌లో వసంతకాలం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి మే, జూన్‌లలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయి. దీనివల్ల ప్రజలు, మౌలిక సదుపాయాలు నెమ్మదిగా వేడికి అలవాటుపడడం గమనించవచ్చు. కానీ బ్రిటన్‌లో చల్లని, వర్షపు వాతావరణం తర్వాత వేడిగాలులు అకస్మాత్తుగా విరుచుకుపడతాయి. ఈ ఏడాది కూడా మే నెలలో చల్లగా ఉన్న వాతావరణం, కొద్ది వారాల్లోనే రికార్డు స్థాయి వేడికి చేరింది. దీంతో ప్రజలు శారీరకంగా అలవాటుపడటానికి సమయం లేకుండా పోయింది. మరో ముఖ్యమైన అంశం బ్రిటన్‌లో వేసవిలో పగటి సమయం చాలా ఎక్కువగా ఉండటం. జూన్, జూలై నెలల్లో సాయంత్రం చాలా ఆలస్యంగా చీకటి పడుతుంది. దీనివల్ల భవనాలు, రహదారులు ఎక్కువ గంటల పాటు సౌరశక్తిని గ్రహిస్తాయి. సూర్యాస్తమయం తర్వాత కూడా ఈ వేడి నెమ్మదిగా వాతావరణంలోకి విడుదల కావడంతో రాత్రులు కూడా వెచ్చగా ఉంటున్నాయి. ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గని ఈ 'ట్రాపికల్ నైట్స్' వల్ల, పగటి వేడికి గురైన శరీరానికి కోలుకునే అవకాశం లభించడం లేదు. వాతావరణ మార్పుల కారణంగా ఐరోపాలో వేడిగాలులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో కేవలం అధిక ఉష్ణోగ్రతలే కాకుండా చల్లని వాతావరణం కోసం నిర్మించిన దేశ మౌలిక సదుపాయాలే బ్రిటన్‌కు అతిపెద్ద సవాల్‌గా మారాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అసమతుల్యతే థర్మామీటర్‌పై తక్కువ అంకె చూపిస్తున్నా, అక్కడి వేడి భారత్ కంటే భరించలేనిదిగా అనిపించడానికి కారణమవుతోంది.

# హైదరాబాద్ 'గోల్డ్ మ్యాన్' పై చీటింగ్ కేసు

-'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్‌పై చీటింగ్ ఆరోపణలతో కేసులు
-సీఎం, పోలీస్ కమిషనర్ పేర్లు చెప్పి బంగారం ఇప్పిస్తానని మోసం
-రూ.32 లక్షలు తీసుకుని బాధితులను బెదిరించినట్టు ఫిర్యాదు
-విచారణలో నకిలీ బంగారంగా తేలిన సూర్య భాయ్ ఆభరణాలు
-కోటి రూపాయలని చెప్పిన నగల విలువ రూ.3 లక్షలేనని నిర్ధారణ



హైదరాబాద్, సింధూరదర్శిని: సోషల్ మీడియాలో ఒంటినిండా బంగారంతో మెరిసిపోతూ 'గోల్డ్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న పి. సురేశ్ కుమార్ అలియాస్ సూర్య భాయ్‌పై హైదరాబాద్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. తక్కువ ధరకే దిగుమతి చేసుకున్న బంగారం ఇప్పిస్తానని చెప్పి పలువురిని మోసగించినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తనకు అత్యంత సన్నిహితులని నమ్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకే బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్నాక బంగారం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక బాధితుడి నుంచి రూ.32 లక్షలు వసూలు చేసిన సూర్య భాయ్, ఆ తర్వాత బంగారం ఇవ్వలేదు. బాధితులు అతని ఇంటికి వెళ్లి నిలదీయగా, వారికి మూడు ఐఫోన్లు ఇచ్చి, రూ.20 లక్షలకు చెక్కు రాసిచ్చాడు. అయితే, ఆ తర్వాత వారిని బెదిరించి ఫోన్లను తిరిగి లాక్కున్నట్టు బాధితులు తమ ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై మొదట అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో పాటు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసినందుకు గాను సూర్య భాయ్‌పై మరో కేసు కూడా నమోదైంది. అతను ఇచ్చిన సమాచారం అవాస్తవమని తేలడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మోసాల వెనుక ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అత్తాపూర్‌లో నివసించే 34 ఏళ్ల సూర్య భాయ్, ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి, తెల్లటి దుస్తుల్లో గుళ్లకు వెళ్లే వీడియోలతో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఆదాయపన్ను శాఖ అధికారులు అతనిపై దృష్టి సారించారు. అయితే, వారి తనిఖీల్లో అతను ధరించిన ఆభరణాల్లో చాలా వరకు నిజమైన బంగారం కాదని, చౌకబారు లోహాలతో చేసిన నకిలీవని తేలింది. తాను కోటి రూపాయల విలువైన నగలు ధరించినట్లు అతను చెప్పుకున్నప్పటికీ, అధికారులు జరిపిన విచారణలో వాటి విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని తేలడం గమనార్హం.

# ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్.. రిటైర్మెంట్‌కు ముందు పోస్టింగ్ అందుకేనా?



అమరావతి, సింధూరదర్శిని: సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆమెను స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండేళ్లుగా ఎలాంటి పోస్టింగ్ లేకుండా నిరీక్షిస్తున్న ఆమెకు ఈ నియామకంతో ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ నిర్ణయంతో ఆమె తన సర్వీస్‌ను గౌరవప్రదంగా ముగించేందుకు మార్గం సుగమమైంది. అఖిల భారత సర్వీస్ నిబంధనల ప్రకారం ఒక అధికారి సస్పెన్షన్‌లో లేనప్పుడు, పదవీ విరమణకు ముందు వారికి ఏదో ఒక పోస్టింగ్ ఇచ్చి గౌరవంగా పంపించాల్సి ఉంటుంది. ఈ నిబంధనను పాటిస్తూ ప్రభుత్వం శ్రీలక్ష్మికి పోస్టింగ్ ఇచ్చింది. తద్వారా తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని, నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని అధికారులకు స్పష్టమైన సంకేతాలు పంపింది. ఈ నిర్ణయం అధికార వర్గాల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథాన్ని పెంచే అవకాశం ఉంది.

**పోస్టింగ్‌తో రిటైర్ అవడం ఎందుకు ముఖ్యం?**

ఒక అధికారి పదవిలో ఉండి రిటైర్ అవడానికి, పోస్టింగ్ లేకుండా రిటైర్ కావడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. పదవిలో ఉండి రిటైర్ అయితే, పదవీ విరమణ తర్వాత లభించే ప్రయోజనాలు, పెన్షన్, నో-డ్యూ సర్టిఫికెట్లు పొందడం సులభతరం అవుతుంది. అదే పోస్టింగ్ లేకుండా రిటైర్ అయితే, ఆర్థికంగా పెద్ద నష్టం లేకపోయినా ఈ పత్రాల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇది అధికారికి వృత్తిపరంగా అవమానకరంగా ఉంటుంది.

ఒకవేళ అధికారిపై తీవ్రమైన అవినీతి లేదా క్రిమినల్ ఆరోపణలు ఉండి, సస్పెన్షన్‌లో ఉండగా రిటైర్ అయితే పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. వారికి పూర్తి స్థాయి పెన్షన్ లభించదు, కేవలం తాత్కాలిక పెన్షన్ మాత్రమే అందుతుంది. శాఖాపరమైన విచారణ లేదా కోర్టు తీర్పులో నిర్దోషిగా తేలేంత వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిచిపోతాయి.

**గతంలోనూ ఇలాంటి ఘటనలు**

గతంలో కూడా పలువురు సీనియర్ అధికారులు పదవీ విరమణకు ముందు పోస్టింగ్‌ల కోసం న్యాయపోరాటాలు చేసిన సందర్భాలున్నాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సైతం పదవీ విరమణకు ఒక రోజు ముందు పోస్టింగ్ పొందారు. అయితే, దాని కోసం ఆయన కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. అదేవిధంగా సీనియర్ ఐఏఎస్‌లు కేఎస్ జవహర్ రెడ్డి, పూనం మాలకొండయ్య వంటి వారికి కూడా గతంలో పదవీ విరమణకు ముందు పోస్టింగ్‌లు లభించాయి. మొత్తం మీద శ్రీలక్ష్మి విషయంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. సర్వీస్ నిబంధనలను గౌరవించడమే కాకుండా అధికారులలో నూతన ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంచేదిగా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆసుపత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు

కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న ముద్రగడ

హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నేత

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన బొత్స, తోట త్రిమూర్తులు



హైదరాబాద్, సింధూరదర్శిని: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈరోజు ఆసుపత్రికి వెళ్లారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# వెనెజువెలాకు భారత్ భారీ సాయం.. 'ఆపరేషన్ అమిస్తాద్' ప్రారంభం



ఐఏఎఫ్‌కు చెందిన రెండు సీ-17 విమానాల్లో వైద్య సామగ్రి

భీష్మ క్యూబ్‌లు, మందులు, 35 టన్నుల సహాయ సామగ్రి

బయలుదేరిన 41 మంది వైద్య బృందం

235కు చేరిన మృతుల సంఖ్య

వేలాది మంది గల్లంతు

వెనెజువెలాకు అండగా ఉంటామని భారత్ హామీ


వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది.

ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

## మీరు ఉదయం అరగంట నడిస్తే
# మీకు కనీసం పది ప్రయోజనాలు



సైన్స్ అండ్ టెక్నాలజీ జీవితాన్ని ఎంతగానో ఆధునీకరించాయి. మనమందరం ఇప్పటికీ టెక్నాలజీ ఉచ్చులో చిక్కుకున్నాము. సాంకేతికత మన రోజువారీ పది పనులను సులభతరం చేస్తున్నందున, యంత్రాలకు అవసరం లేని అన్ని శారీరక పనులను మనం నియంత్రించుకుంటాము. మన వృద్ధాప్యంలో, ప్రజలు ఎక్కువగా ఆరోగ్యంగా ఉండాలి మరియు ఆరోగ్యం మరియు ఫిట్నెస్ కోసం విడిగా సమయం మరియు డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేదు. ఇప్పుడు ప్రాణాంతకమని నిరూపించబడిన వ్యాధులు చాలా అరుదు. మన పెద్దలు ఆరోగ్యంగా ఉన్నందున, వారి ఆహారం సేంద్రీయమైనది మరియు వారు తగినంత ఆహారాన్ని తినడం లేదు. మన పూర్వీలు చాలా కష్టపడేవారు మరియు వారికి నడక మరియు వ్యవసాయ ఆధారిత వ్యాయామాలు తప్ప వేరే వ్యాయామం తెలియదు. నడక అనేది మనిషి శరీరానికి అత్యంత సరైన వ్యాయామం. ఏదైనా ఇతర బాడీబిల్డింగ్ వ్యాయామం శరీరంపై అనారోగ్య ఒత్తిడిని కలిగిస్తుంది. అందువల్ల, మీరు కృత్రిమ ఆరోగ్యం కాకుండా రోజుకు



కేవలం ముప్పై నిమిషాలు నడవడం ద్వారా సాధారణ ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు, వీటిని ఖరీదైన వ్యాయామ పరికరాలు, జిమ్ లు మరియు మరెన్నిటి ద్వారానో సాధించవచ్చు. నడకతో సాధారణ అనుభూతి చెందారా? నడక శరీరంలోని అన్ని కండరాలకు మంచి వ్యాయామం ఇస్తుంది మరియు ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. మన జీవితంలో సరళమైన విష యాలు గొప్ప ఆనందాన్ని అందించినట్లే, సాధారణ వ్యాయామాలు మన ఆరోగ్యానికి గొప్పప్రయోజనాన్ని అందిస్తాయి. కాబట్టి నడక ఆరోగ్యానికి కీలకం అని సులభంగా చెప్పవచ్చు. రండి, అరగంట నడక యొక్క మొదటి పది ప్రయోజనాలను పరిశీలిద్దాం ... నడక మన హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది క్రమం తప్పకుండా నడవడం వల్ల మన హృదయ స్పందన రేటు కొద్దిగా పెరుగు తుంది. కానీ అతిగా కాదు. ఇది ప్రసరణను కొంచెం మెరుగుపరుస్తుంది, కానీ శ్వాస అంత వేగంగా కాదు. కాబట్టి కొంచెం ఎక్కువ ప్రసరణ గుండెపై ఎక్కువ ఒత్తిడి చేయకుండా రక్తపోటును ఆరోగ్యకరమైన పరిమితుల్లో ఉంచడానికి సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. జీవరసాయన క్రియను






ఉత్తమంగా ఉంచుతుంది నడక జీర్ణవ్యవస్థను అవసరమైనంతగా ప్రేరేపిస్తుంది మరియు ఎక్కువ జీర్ణ అవసరాలను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది ఆహారాన్ని పూర్తిగా జీర్ణం చేయడానికి మరియు తద్వారా జీవరసాయన పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుంది. విరేచనాలతో నిండిన ఆహారాలు జీర్ణక్రియ మరియు దానితో వచ్చే సమస్యల నుండి మిమ్మల్ని రక్షిస్తాయి. ఎముకలు బోలు సమస్యల నుండి రక్షిస్తుంది ఎముకలు సాధారణ నడక ద్వారా స్థిరీకరించబడతాయి మరియు సులభంగా చిరిగి పోకుండా కాపాడుతుంది. శరీరంలో అధిక విటమిన్ డి 3 ఉత్పత్తి అవుతుంది, ముఖ్యంగా సూర్యుని యువ కిరణాలు తీసుకున్నప్పుడు. ఈ విటమిన్ ఆహారంలో కాల్షియం మొత్తాన్ని గ్రహించడంలో సహాయపడు తుంది. ఇది ఎముకల ఎముకలలో మజ్జ ఎండిపో కుండా నిరోధి స్తుంది. ఇది ఆర్థరైటిస్ నుండి రక్షణను అందిస్తుంది. కండరాలు గట్టిగా ఉండటానికి సహాయపడు తుంది రోజుకు ఒకసారి నడవడం కండరాలను నిర్మించడానికి మరియు శరీరంలో కండరాల-కొవ్వు నిష్పత్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఫలితం వక్రీకృత కండరాలను పొందగలుగుతుంది. తొడలు మరియు ముంజేయి యొక్క కండరాలు, ముఖ్యంగా, వ్యాయామ పాఠశాలల్లో కంటే చెమట మరియు అలసటతో మెరుగ్గా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది నడక మన శరీరంలో ఎక్కువ తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది మరియు తద్వారా రోగ నిరోధక శక్తిని మెరుగుపరు స్తుంది. రోజూ క్రమం తప్పకుండా మరియు ఒక రోజు లేకుండా అరగంట పాటు నడిచే రోగులు చాలా ఆరోగ్యంగా.. ఉత్తమంగా ఉంటారు మరియు జలుబు మరియు దగ్గు జ్వరం వచ్చే ఇతరులకన్నా తక్కువ. మెదడు కండరాలను ప్రేరేపిస్తుంది నడవడం ద్వారా మెదడు కణాల కార్యకలాపాలను పెంచుతుంది. మెదడు కణజాల నష్టం మరియు వినికిడి నష్టం మరియు జీవన నాణ్యత కోల్పోకుండా జ్ఞాపకశక్తి కోల్పోకుండా కాపాడుతుంది. క్రమం తప్పకుండా నడవడం జ్ఞాపకశక్తిని మెరుగు పరుస్తుంది మరియు అల్జీమర్స్ వ్యాధి, మెదడు రుగ్మతతో సహ ఇతర వ్యాధుల నుండి రక్షిస్తుంది. అప్రమత్తంగా ఉండటానికి మీకు సహాయపడు తుంది రొటీన్ నడక ద్వారా అనేక అనారోగ్యాలను నివారించవచ్చు. తద్వారా శరీరం మరియు మనస్సు మంచి





స్థితిలో ఉంటాయి మరియు నడక ద్వారా అదనపు ప్రసరణ ద్వారా రక్త ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే సామర్థ్యం ఉంటుంది. అధిక ఆక్సిజన్ అధిక కార్యాచరణ మరియు అప్రమత్తతను నిర్వహించడానికి సహాయపడు తుంది. శరీరం నుండి మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది మన శరీర కండరాలన్నీ కదలికలో ఉన్నప్పుడు, ఇతర అవయవాలు మలినాలను కరిగించడంలో పాల్గొంటాయి. నడక సమయంలో, ప్రేగులలో కార్యకలాపాలు వేగవంతమవుతాయి మరియు మలినాలు పెద్ద ప్రేగులోకి కదులుతాయి. మలినాలను శరీరం నుండి విడుదల చేసినప్పుడు, శరీరం యొక్క సామర్థ్యం పెరుగుతుంది. నడక మనకు సంతోషాన్ని ఇస్తుంది మీ ఇంటికి సమీపంలో ఉన్న పార్కులో లేదా మీకు ఇష్టమైన ప్రదేశంలో ప్రతిరోజూ అరగంట పాటు నడవడం మనస్సు యొక్క ఒత్తిడిని తగ్గిస్తుంది మరియు మెదడులో ఆక్సిటోసిన్ ఉత్పత్తి చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గిస్తుంది. తత్ఫలితంగా, నిరాశకు గురయ్యే అవకాశం తక్కువ. మనస్సు యొక్క స్థితిని తొలగిస్తుంది మరియు మీకు సుఖంగా ఉండటానికి సహాయపడుతుంది. బలాన్ని పెంచుతుంది ఒక అధ్యయనం ప్రకారం అరగంట క్రమం తప్పకుండా నడుస్తూ ఆరోగ్య కరమైన ఆహారనియమాలు పాటించేవారు ఇతరులకన్నా ఐదు నుంచి ఏడు సంవత్సరాలు తక్కువ వయస్సున్న వారిలా కనబడుతారు.

కొన్ని అనారోగ్యాలు నడకతో కప్పబడవు, అందుకే అవి బరువు తగ్గుతారు. రెగ్యులర్ అరగంట నడక శరీర బరువును తగ్గిస్తుంది మరియు జీవితాన్ని పూర్తిస్థాయిలో జీవించటానికి మిమ్మల్ని అనుమతిస్తాయి. ఈ కథనాన్ని మీ స్నేహితులతో పంచుకోండి, తద్వారా వారు ఈ వ్యాసంలో ఉపయోగ కరమైన సమాచారాన్ని పొందవచ్చు.



# ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు.. ప్రభుత్వానికి విజయశాంతి కీలక ప్రతిపాదన

ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ కాలేజీలు కనీస ప్రమాణాలు పాటించాలన్న విజయశాంతి

చాలా కాలేజీల్లో వసతులు లేవన్న విజిలెన్స్ నివేదికను గుర్తుచేసిన ఎమ్మెల్సీ

ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్




హైదరాబాద్, సింధూరదర్శిని: తెలంగాణలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లతో పాటు, కనీస విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను విజయశాంతి స్వాగతించారు. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఫీజులు వసూలు చేసే హక్కు ప్రైవేట్ యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ కమిషన్ సమర్పించిన నివేదిక సైతం పలు ప్రైవేట్ కళాశాలల్లో సరైన వసతులు లేవని స్పష్టం చేసిన విషయాన్ని విజయశాంతి గుర్తుచేశారు. ఈ అంశాన్ని తాను ఇదివరకే శాసనమండలిలో సైతం ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రజాధనంతో చెల్లించే రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# వీటితో సంపూర్ణ ఆరోగ్యం.. రోజూ గుప్పెడు తింటే చాలు!

ప్రోటీన్లు, ఫైబర్‌తో నిండిన పోషకాల గని శనగలు – జీర్ణక్రియను మెరుగుపరిచి, గుండె ఆరోగ్యానికి భరోసా

రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణలో సహాయకారి – రోగనిరోధక శక్తిని పెంచి బరువు తగ్గడానికి తోడ్పాటు



ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ఖరీదైన ఆహారాలే అవసరం లేదు. మన వంటింట్లో ఉండే శనగలతోనే ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు పొందవచ్చు. ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే శనగలను పోషకాల గనిగా చెప్ప వచ్చు. వీటిని రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు. శనగలు శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో ముందు ంటాయి. వీటిలో ఉండే ప్రోటీన్లు, పీచుపదార్థం (ఫైబర్) జీర్ణవ్యవస్థను మెరుగుపరు స్తాయి. మలబద్ధకం వంటి సమస్యలను నివారించి, జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయి. ముఖ్యంగా, గుండె ఆరోగ్యానికి శనగలు ఎంతగానో మేలు చేస్తాయి. రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ముప్పును దూరం చేస్తాయి. మధుమేహంతో బాధపడేవారికి శనగలు ఒక వరంలాంటివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడం లో కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, వీటిలో ఉండే పోషకాలు రోగ నిరోధక శక్తిని పెంచు తాయి. బరువు తగ్గాల నుకునే వారికి కూడా శనగలు మెరుగైన ఎం పిక. కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలిగించి, అనవసరమైన తిండి తినకుండా నియంత్రిస్తాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతిరోజూ కనీసం గుప్పెడు శనగలు తినాలని సూచిస్తున్నారు.

# సినిమా న్యూస్




మేధా శంకర్ ధరించిన ఆకర్షణీయమైన బ్లాక్ కేప్ (ఝుజావ) దుస్తుల శైలి ఆన్‌లైన్‌లో అందరి మనసులను గెలుచుకుంటోంది. ఈ గ్లామరస్ ఫోటోషూట్‌లో, ఆమె బోల్డ్ బ్లాక్ సీక్విన్డ్ బ్రాలెట్ మరియు పల్చని, వదులుగా ఉండే కేప్‌లో మెరిసిపోతూ, తన అద్భుతమైన రూపం మరియు భావయుక్తమైన కళ్లతో ఆత్మవిశ్వాసాన్ని, హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది.

## రొమాన్స్‌లో కొత్త జంటల దుందుడుకు!



సినిమా ప్రేక్షకులకు ఎల్లప్పుడూ సరికొత్త అనుభూతిని ఇచ్చే అంశాలలో వెండితెరపై కొత్త జంటల కలయిక ఒకటి. ఇప్పటికే స్టార్‌డమ్ ఉన్న నటులతో కొత్త తారల కలయిక కూడా ఆసక్తిని కలిగిస్తుంది. నిజానికి మునుపెన్నడూ చూడని సరికొత్త కాంబినేషన్లు స్క్రీన్‌పైకి వచ్చినప్పుడు వారి మధ్య ఉండే కెమిస్ట్రీ, సరికొత్త ఉత్సాహం ప్రేక్షకులలో మరింత కుతూహలాన్ని రేకెత్తిస్తాయి. బాలీవుడ్ మునుపెన్నడూ లేని విధంగా 2026లో సరికొత్త లవ్ స్టోరీలు, హారర్, యాక్షన్, ఫాంటసీ చిత్రాలతో సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే పలువురు యంగ్ నటీనటులు సరికొత్త జోడీలుగా ఇండస్ట్రీని షేక్ చేయడానికి దూసుకొస్తున్నారు. ఆసక్తికరంగా టాలీవుడ్ యంగ్ ట్యాలెంట్ శ్రీలీల, జయకృష్ణ ఘట్టమనేని కూడా ఈ జాబితాలో ఉన్నారు. ప్రస్తుత తరం ప్రేక్షకులు పాత ఫార్ములా కాస్టింగ్‌ల కంటే.. స్క్రీన్‌పై కనిపించే జంటల మధ్య ఉండే సహజమైన కెమిస్ట్రీ, అద్భుతమైన నటన - సరికొత్త కథనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మార్పును అందిపుచ్చుకుంటూ మైథాలజీ, రొమాన్స్, డ్రామా, హారర్ వంటి విభిన్న జోనర్లలో కొత్త జంటలు సరికొత్త ఒరవడిని సృష్టించబోతున్నాయి. 2026 బాలీవుడ్ చలనచిత్ర రంగును మార్చబోతున్న ఆరు క్రేజీ యంగ్ కపుల్స్ కథేంటో ఇప్పుడు చూద్దాం. మొదటిగా -ముంజ్యా- సినిమాతో భారీ విజయం సాధించిన అభయ్ వర్మ, యువ నటి రాషా తడాని కలిసి -లయ్యా లయ్యి- అనే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. వీరిద్దరి ఎనర్జీ, చరిష్మా ఈ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. రాషా తడానీ మరోవైపు టాలీవుడ్ డెబ్యూ నటుడు జయకృష్ణ సరసన నటిస్తూ ఇటు తెలుగు చిత్రసీమలోను గుబులు పెంచుతున్న సంగతి తెలిసిందే. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలైలో విడుదలకు సిద్ధమవుతోంది. రవీనా టాండన్ కుమార్తెగా రాషా తడానీకి టాలీవుడ్ లో క్రేజ్ ఉంది. ఇక్కడ పెద్ద కెరీర్ జర్నీని ఆశిస్తోంది. మొదటి సినిమా విజయం దీనిని డిసైడ్ చేయొచ్చు. మరోవైపు సల్మాన్ సరసన డెబ్యూ ఇచ్చి, వైవిధ్యమైన నటనతో ఆకట్టుకున్న సాయి మంజ్రేకర్ -కిల్- సినిమాతో ఇంటెన్స్ పెర్ఫామెన్స్ ను కనబరిచిన రాఘవ్ జుయల్‌తో కలిసి -ఇకాయ్- అనే చిత్రంలో భిన్నమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో అలరించనున్నారు. ఇక టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన శ్రీలీల బాలీవుడ్ కొత్త తరం నటుడు ఇబ్రహీం అలీ ఖాన్ జోడీగా నటిస్తున్న -దిలేర్- చిత్రం 2026లో ఒక మోడ్రన్ రొమాంటిక్ జానర్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే -సయ్యారా- సక్సెస్ తర్వాత మంచి గుర్తింపు తెచ్చుకున్న అనీత్ పద్దా టాలెంటెడ్ నటుడు విశాల్ జెత్వాతో కలిసి -శక్తి శాలిని- చిత్రంలో నటిస్తోంది. విశాల్ ఎమోషనల్ రేంజ్, అనీత్ స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాకు ప్రధాన అస్సెట్స్ కానున్నాయి. ఇక ది ఆర్చీస్, మేడ్ ఇన్ హెవెన్ చిత్రాలతో అలరించిన మిహిర్ అహూజా...-చిరయ్య- నటి ప్రసన్న బిష్త్ కలిసి ఆదిత్య చండియోకే దర్శకత్వంలో ఒకఅన్‌టైటిల్డ్ డ్రామెడీ చిత్రంలో నటిస్తున్నారు. చిన్న పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథలో వీరి మధ్య ఉండే అమాయకత్వం, కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇవ్వడం ఖాయం. దిఆర్చీస్, జిగ్రా చిత్రాలతో నేటి తరం ప్రేక్షకులలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న వేదాంగ్ రైనా, తన తదుపరి మ్యాడోక్ ఫిల్మ్స్ ప్రాజెక్ట్‌లో ప్రగతి శ్రీవాస్తవతో జోడీ కడుతున్నాడు. వేదాంగ్ నటించిన మై వాపస్ ఆవుంగా చిత్రం సైలెంట్ బ్లాక్ బస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడి క్రేజ్ అమాంతం పెరిగింది.జనాదేశ్, -నక్షత్రవాలీ- వంటి చిత్రాలతో బాలీవుడ్ మెయిన్ స్ట్రీమ్ సినిమా రంగంలోకి దూసుకొస్తున్న ప్రగతి, వేదాంగ్ కాంబినేషన్ 2026లో అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఈ విధంగా రొమాన్స్ - యూత్‌ఫుల్ ఎనర్జీతో దూసుకొస్తున్న ఈ ఆరు కొత్త జంటలు 2026లో వెండితెరపై సరికొత్త మ్యాజిక్ సృష్టించడానికి సిద్ధంగా ఉన్నాయి.

## మహేశ్-రాజమౌళి సినిమాపై బిగ్ అప్‌డేట్.. అప్పటిలోగా షూటింగ్ పూర్తవుతుందన్న జక్కన్న!



మరో
నాలుగు నెలల్లో మహేశ్-రాజమౌళి సినిమా షూటింగ్ పూర్తి
సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో చిత్రీకరణ ముగుస్తుందన్న రాజమౌళి
ఐమాక్స్ అనుభూతి కోసం 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' టెక్నాలజీ వినియోగం
ఇప్పటికే కీలక యాక్షన్ ఘట్టాల చిత్రీకరణ పూర్తి
2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల

సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ సినిమా అప్‌డేట్‌లను ఫ్యాన్స్ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం షూటింగ్‌కు సంబంధించి రాజమౌళి స్వయంగా ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ నాటికి చిత్రీకరణ మొత్తం పూర్తి కానుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న రాజమౌళి, ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. సినిమాలోని కీలకమైన యాక్షన్ సన్నివేశాలు, వారణాసిలో జరగాల్సిన ముఖ్యమైన షెడ్యూల్ ఇప్పటికే విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం కేవలం కథను ముందుకు నడిపే చిన్న చిన్న సన్నివేశాలను, ప్యాచ్ వర్క్‌ను మాత్రమే చిత్రీకరించాల్సి ఉందని జక్కన్న వివరించారు. ఆయన మాటలతో సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నట్లు స్పష్టమైంది. ఈ చిత్రాన్ని ఐమాక్స్ (IMAX) ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ఆసక్తికరమైన సాంకేతిక వివరాలు పంచుకున్నారు. ఈ కథను ఐమాక్స్ తెరపై చూస్తేనే అసలైన అనుభూతి కలుగుతుందని, అందుకే ఈ ఫార్మాట్‌ను ఎంచుకున్నామని తెలిపారు.

అయితే, ఐమాక్స్ కోసం కథలో మార్పులు చేయలేదని, కేవలం సాంకేతిక సర్దుబాట్లు మాత్రమే చేశామని అన్నారు. సాధారణ సినిమా స్కోప్, ఐమాక్స్ రెండింటికీ అనుకూలంగా ఉండేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' అనే ప్రత్యేక పద్ధతిని ఉపయోగించి చిత్రీకరణ జరుపుతున్నట్లు వివరించారు. ఈ టెక్నిక్‌తో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ తర్వాత పని సులభంగా సాగిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. రాజమౌళి తాజా ప్రకటనతో సినిమా విడుదల తేదీపై కూడా స్పష్టత వచ్చినట్లయింది.

## కెరీర్ ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను: కృతి సనన్

'కాక్‌టెయిల్-2'తో భారీ హిట్ కొట్టిన కృతి సనన్
తన తొలి ఫొటో షూట్, ర్యాంప్ వాక్ రెండూ ఫ్లాప్ అయ్యాయని వెల్లడి
టాలెంట్ లేకపోయినా కొందరు ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా అవకాశాలు పొందుతున్నారని విమర్శ



కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యవ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది.

"ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662